అజయ్‌కి బంగారు పతకాలు

సాధించిన బంగారు పతకాలతో అజయ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారుడు వల్లూరు అజయ్‌బాబు రెండు బంగారు పతకాలు సాధించాడు. ఫిజీ దేశంలో ఈ నెల 16 నుంచి 20 వరకు జరుగుతున్న కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అజయ్ సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. స్నాచ్ 147, క్లీన్ అండ్ జర్క్ 179 కిలోలు మొత్తం 326 కిలోల బరువెత్తి విజేతగా నిలిచాడు. కామన్ వెల్త్ క్రీడల విజేత వల్లూరు శ్రీనివాసరావు తనయుడే అజయ్. అజయ్‌ని రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నీలంశెట్టి శ్రీలక్ష్మి, సెక్రటరీ దిన్నా బాబు, బడేటి వెంకటరామయ్య, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బెల్లాన లక్ష్మి, నరేంద్ర, సెక్రటరీ చల్లా రాము, కోచ్ శ్రీనివాస్, మధు అభినందించారు.

మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్

ఇప్పటివరకు ఏర్పడిన ప్రభుత్వాల్ని హామీలు సంగతి గట్టిగా అడగలేం. ఇది సబబు కాదు కూడా కొందరు అంటుంటారు. కానీ, 'ఇది మంచి ప్రభుత్వం, ఎందుకంటే 100 రోజుల్లో ఎంతో సాధించింది. సంక్షోభంలోనూ సంక్షేమం సాధించి, రెక్కలు తొడిగింది' అంటూ నేటి నుంచి ఆరు రోజులపాటు ప్రభుత్వం గ్రామ సభలకు సిద్ధమౌతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హామీలు, అమలు, ప్రజల ఆశలు, ఆకాంక్షల గురించి జనం చర్చించు కుంటున్నారు.

- భరోసాగా మిగిలిన సూపర్-6
- సకాలంలో వేతనాలు, పింఛన్లు
- కూటమి ప్రభుత్వానికి నేటికి వంద రోజులు
- 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ నేటి నుంచి గ్రామసభలు

అమలు కాని హామీలెన్నో

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపట్టి నేటికి వందరోజులు పూర్తయింది. ఎంతో అభివృద్ధి, మరెంతో సంక్షేమం చేపట్టినట్టు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఈ ప్రగతిని వివరించేందుకు ఈ నెల 20నుంచి 26 వరకు 6 రోజులపాటు నిర్విరామంగా గ్రామసభలు నిర్వహించనున్నారు. తద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం సైతం సమాయత్తమైంది. విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిరోజు గజపతినగరం మండలం కెంగువ, రెండో రోజు దత్తిరాజేరు మండలం దత్తి గ్రామాల్లో పాల్గొంటారు. మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ఈ ఆరు రోజులపాటు గ్రామసభల్లో పాల్గొంటారు. ఈ సంగతి కాస్త అటుంచితే....

గడిచిన వందరోజుల్లో కూటమి ప్రభుత్వ హామీల రుచిప్రజలకు చూపించలేక పోయారన్నది వాస్తవమేనని జనం చర్చించుకుంటున్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించడం, పింఛన్లు రూ.1000 పెంపు, ప్రజలు, కూటమి నాయకుల విరాళాలతో చేపట్టిన అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ వంటివి మినహా పెద్దగా చేసిందేమీ లేదని చెప్పుకుంటున్నారు. ధాన్యం సొమ్ము రైతులకు సకాలంలో చెల్లించినట్టు చెప్పుకుంటున్నా అటువంటి లావాదేవీలు మన జిల్లాలో చాలా తక్కువ. పైగా సకాలంలో చెల్లింపులు అనేది కూడా అర్ధసత్యమే అవుతుంది. ఇక మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకముందే రాకముందే ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. నయా పైసా ఖర్చుతో సంబంధం లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూడా ఏదో సాధించిన విధంగా గొప్ప చెప్పుకుంటోంది. ఇవి మినహా కూటమి నెరవేర్చిన హామీలుగా, సమస్యల పరిష్కారం గుర్తించి చెప్పుకునేందుకు పెద్దగా ఏమీ లేవు.

ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభించి మూడు నెలలు గడిచినా 'తల్లికి వందనం' హామీ నెరవేరలేదు. దీంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ పంటల సాగు నడిగాలానికి వచ్చింది. పెట్టుబడుల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేలు గురించి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సూపర్ -6 హామీలేవీ ఇంకా అమలుకు నోచుకోలేదు. ఇంకా అమలు చేస్తామనే చెప్తున్నారు తప్ప ఆచరణకు నోచుకోక పోవడంతో జనంలో నిరాశ పెరుగుతోంది. స్థానిక సమస్యలు పరిష్కారం, అభివృద్ధి కూడా నేతిబీరకాయలో నెయ్యి వెతికిన చందమే. ముఖ్యంగా విజయనగరం గంజాయి క్రయ, విక్రయాలకు కేంద్రంగా మారిందని నాడు టిడిపి నాయకులు విమర్శించారు. ఈ విషయంలో ఇప్పటికీ మార్పులు కనిపించడం లేదు.

అధికారంలోకి వస్తే జ్యూట్, ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు పునర్జీవనం పోస్తామంటూ అధినేత సహా పలు నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు ఎన్నికల్లో చెప్పారు. మాట నిలబెట్టుకోడం సంగతి అటుంచితే ఇప్పటి వరకు జిల్లాగానీ, రాష్ట్రంలోగానీ ఈ రంగాలపై కనీసం చర్చేలేకపోవడం గమనార్హం. పైగా జీగిరాం, నెల్లిమర్ల జ్యూట్ మిల్లులు మూతపడ్డాయి. ఇచ్చిన మాట ప్రకారం తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు లేవు. ఝంజావతి ప్రాజెక్టుపై చొరవ చూపలేదు. ఎస్.కోట ఎన్నికల సభలో 'భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఎలా ముందుకు తీసుకుపోవాలో ఆలోచిస్తాం అన్న బాబు ఆ దిశగా ఆలోచన చేయలేదు. తోటపల్లి కుడికాలవ ద్వారా గజపతినగరం బ్రాంచి కెనాల్ నిర్మాణం, ఎడమ కాలువ ద్వారా కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాలకు సాగునీరు, ఎపి ఇపి డిసిఎల్‌లో గత ప్రభుత్వం విలీనం చేసిన చీపురుపల్లి ఆర్ఇసిఎస్ తిరిగి స్వతంత్రంగా నడుపుతామని, గుమ్మలక్ష్మీపురంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, పూర్ణపాడు-లాబేసు వంతన నిర్మాణం పూర్తి, గుమ్మడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణ, నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దడం, గిరిజనులకు ట్రైకార్ రుణాల మంజూరు ఇలా ఒకటా రెండా ఇవి మచ్చుకు మాత్రమే. వీటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. చివరికి గిరిజన ప్రాంతంలో పెద్దగా డబ్బులు అవసరం లేని ఏనుగుల నుంచి రక్షణ చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోలేకపోయింది.

విమానాశ్రయ భద్రతా సిబ్బంది నివాసాల కోసం కేటాయించిన భూములివే

- గతంలో సేకరించిన 11 ఎకరాలు కేటాయింపు
- ఈ భూమికి వెళ్లేందుకు రహదారి కోసం భూసేకరణ

విమానాశ్రయ భద్రతా సిబ్బందికి ముంజేరు సమీపంలో నివాసాలు

ప్రజాశక్తి- భోగాపురం

విమానాశ్రయానికి భద్రత దృష్ట్యా సిఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండ్రస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) సిబ్బంది ఉంటారు. వీరికి అవసరమైన నివాస గృహాలను ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలి. దీనిలో భాగంగా మొదట బసవపాలెం రెవెన్యూ పరిధిలోని తూడెం సమీపంలో దిబ్బ కొండ ప్రాంతాన్ని ప్రతిపాదించారు. 21 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంపిక చేసి అక్కడ ఎన్నో ఏళ్ళుగా భూమిపై ఉంటున్న రైతుల జీడితోటలను సైతం తొలగించి చదును చేశారు. ఇంతలో పుడ్‌కోర్టు సంస్థ గతంలో ఆ భూములను తమకు కేటాయించారంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో అధికారులు రావాడ రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీల వద్దనున్న మరో కొండను పరిశీలించారు. అది అనువుగా లేదని జిఎంఆర్ సంస్థ చెప్పడంతో నిలిపివేశారు. చివరకు ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామ సమీపంలోని అగ్ని చెరువు కింద గతంలో విమానాశ్రయం కోసం సేకరించిన భూమిని కేటాయించినట్లు చెబుతున్నారు.

విమానాశ్రయ భద్రతా సిబ్బందికి అవసరమైన నివాస గృహాలను ముంజేరు సమీపంలోని పిట్టపేట వద్దనున్న విమానాశ్రయ భూముల్లోనే నిర్మించాలని ఎట్టకేలకు అధికారులు నిర్ణయించారు. గతంలో ఇక్కడ విమానాశ్రయం భూసేకరణలో భాగంగా సేకరించారు. కాని ఈ భూమికి రహదారి సౌకర్యం లేకపోవడంతో రహదారికోసం భూసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ఈ భూమికి నాలుగువైపులా రహదారి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని జిల్లా అధికారులకు నివేదించనున్నారు. ఇందులో ఏదో ఒకదానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

రహదారి కోసం మరోసారి భూసేకరణ

విమానాశ్రయం నిర్మాణానికి తొలుత 5వేలు ఎకరాలు అవసరమని అప్పటి టిడిపి ప్రభుత్వం 2016లో గుర్తించించి. దీనితో ముంజేరు రెవెన్యూ పరిధిలోని భూములు కూడా భూసేకరణ చేయాల్సి వచ్చింది. దీంతో ముంజేరు రెవెన్యూ రైతులు ఆందోళనలు చేయడంతో ప్రస్తుత నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో 2700 ఎకరాలకు కుదించారు. కానీ అప్పటికే ముంజేరు రెవెన్యూ పరిధిలోని 11 ఎకరాలను ప్రభుత్వానికి రైతులు ఇచ్చేయడంతో పరిహారం కూడా ఇచ్చేశారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ రైతుల జిరాయితీ భూములే ఉన్నాయి. రహదారి సౌకర్యం లేకపోవడంతో భూసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఏ విధంగా రహదారి వేస్తే అనువుగా ఉంటుందనే దానిపై ప్రస్తుతం సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రహదారిని ఖరారు చేయనున్నారు.

ఇసుక సరఫరా పోర్టల్ ప్రారంభం

విజయనగరంకోట : సులభంగా ఇసుకను బుక్ చేసుకోడానికి ఎపి శాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్‌ను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వర్చువల్ గా గురువారం ప్రారంభించారు. ఆన్‌లైన్ లేదా గ్రామ వార్డు సచివాలయంలో ఇసుకను ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు ఇసుక బుకింగ్ ఆర్డర్ తీసుకోవాలని సిఎం స్పష్టంచేశారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, మైన్స్ డిడి సూర్య చంద్ర రావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ మణి కుమార్ సులభంగా ఇసుక బుకింగ్ చేసుకోవడం ఎలా అనే కరపత్రాలు విడుదల చేశారు.

వేద పండితులకు నిరుద్యోగ భృతి

విజయనగరం : వేదవిద్యను అభ్యసించిన నిరుద్యోగ వేద పండితులు, నిరుద్యోగ భృతి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమీషనర్ కె.ఎల్.సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3,000 చెల్లిస్తుందని తెలిపారు. వేదవిద్య చదివినవారు తమ సర్టిఫికెట్లు, ఆధార్ జెరాక్స్ కాపీలతోపాటు, ఏ ఉద్యోగమూ చేయడం లేదన్న స్వీయ ధ్రువపత్రంతో, జిల్లా దేవాదాయశాఖ అధికారి, దేవాదాయ ధర్మాదాయ శాఖ, విజయనగరం కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 26లోగా అందజేయాలని సూచించారు.

వైసిపి జిల్లా నాయకులతో చర్చిస్తున్న ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

జిల్లా నాయకులతో జగన్ భేటీ

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్లమెంట్ సభ్యులతో వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు కోలగట్ల వీరభద్రస్వామి, శంబంగి వెంకట చినప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య తదితరులు హాజరయ్యారు. టిడిపి కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన, సూపర్ సిక్స్ పథకాల అమలు వంటి అంశాలపై జగన్ నాయకులు చర్చించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో ప్రభుత్వం విఫలం కావడంతో భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక, వ్యూహాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా పార్టీ నాయకులను, కార్యకర్తలను కార్యోన్ముఖుల్ని చేయాలని జగన్ సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షులుగా మజ్జి శ్రీనివాసరావును నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'

ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో వంద రోజుల ప్రభుత్వ పాలనపై విస్తృత ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచీ నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో ఎంపిడిఒలు, తాహశీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు, ఇతర మండల స్థాయి అధికారులతో ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటైన ఈ వందరోజుల్లోనే ఎన్నో పథకాలు, కార్యక్రమాలను అమలు చేసిందని, వీటిగురించి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి 26వ తేదీవరకు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమం జరగాలని, ఎంఎల్ఎలు ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. మండల నోడల్ అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ప్రతీ గ్రామానికి కూడా ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించాలని, కరపత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజావేదికను నిర్వహించి, సమస్యలు తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

స్వర్ణాంధ్ర -2047 యాక్షన్ ప్లాన్

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ను గ్రామ, వార్డు, మండల, మున్సిపాల్టీ, జిల్లా స్థాయిల్లో రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధికి ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అక్టోబరు 15 నాటికి జిల్లా యాక్షన్ ప్లాన్ పూర్తి కావాలని, దానికి ముందుగానే మండల, మున్సిపాల్టీ, వార్డు, గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్లు ఖరారు కావాలని సూచించారు. యాక్షన్ ప్లాన్లను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడిఎ తారకరామావు, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్చిలోగా ఇళ్లు పూర్తి చేయాలి

గృహనిర్మాణ సంస్థ ఎమ్‌డి రాజాబాబు ● జిల్లాలో హౌసింగ్ కాలనీల సందర్శన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, నెల్లిమర్ల



గుంకలాంలో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న ఎమ్‌డి రాజాబాబు

జిల్లాలో నిర్మాణం ప్రారంభించిన ఇళ్లన్నింటినీ మార్చి నెలాఖరులోగా శతశాతం పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్.డి. పి.రాజాబాబు హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను ఒక దశ నుంచి మరో దశకు నిర్ణీత కాలవ్యవధి ప్రకారం పూర్తిచేయాలని స్పష్టంచేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి రాజాబాబు గురువారం జిల్లాలో పర్యటించారు. విజయనగరం పట్టణ పరిధిలో గుంకలాంలోని ఇళ్ల కాలనీని సందర్శించి ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. నెల్లిమర్లలోని జరజాపుపేట హౌసింగ్ కాలనీని సందర్శించి ఇంజినీర్లకు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణంలో వున్న అవరోధాలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో ఇఇలు, డిఇలు, ఎఇలతో ఇళ్లనిర్మాణంపై సమీక్షించారు.

సంకల్పంతో 'మత్తు'ను తరిమేద్దాం

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ

ప్రజాశక్తి-భోగాపురం

ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి సంకల్పంతో మత్తును తరిమేద్దామని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. మాదక ద్రవ్యాల పై పోరాటం చేసేందుకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాన్ని గురువారం భోగాపురం మండలం మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఐజి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా, అలవాటు నుండి దూరం చేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు జిల్లా పోలీసుశాఖ 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయ మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు రూపొందించిన 100రోజుల ప్రణాళికలో భాగంగా పోలీసుశాఖ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతీ రోజూ చర్యలు చేపడుతుందన్నారు. వ్యసనాలకు డబ్బులు ఖర్చు చేస్తూ, మద్యం, మత్తు కలిగించే వాటి పట్ల ఆకర్షితులవుతూ ప్రక్క దారి పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ఒకరి సమస్య కాదని, ప్రతీ ఒక్కరదని, వాటిని నియంత్రించే బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందన్నారు. అక్రమంగా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న, కలిగివున్న, విక్రయిస్తున్న వారి సమాచారాన్ని పోలీసువారికి అందించాలన్నారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ చేయిచేయి కలిపి పని చేయాలని అన్నారు.

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం వలన చాలా కుటుంబాలు నాశనమ వుతున్నాయన్నారు. సమాజానికి హాని కలిగించే మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లా పోలీసుశాఖ యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణ అన్నది నేడు సమాజం ఎదుర్కొంటున్న పెద్ద ఛాలెంజ్ అని అన్నారు. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం గంజాయి వినియోగం పెరిగి పోయిందన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, ఒకవేళ అలవాటు పడిన వారెవరైనా ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా డీ అడిక్షన్ సెంటరులో ప్రాథమిక స్థాయిలో చికిత్స పొందితే, వాటి నుండి బయట పడవచ్చునని ఎస్‌పి తెలిపారు. మిరాకిల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సిఇఒ లోకం ప్రసాదరావు, ప్రభుత్వ సైక్రియాటీ హెచ్ఒడి డాక్టర్ మల్లిక విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ చుట్టూ ఉన్న వారిని కూడా మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని విద్యార్థులతో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు ఎం. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, కళాశాల డీన్ డాక్టర్ బి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. అర్జునరావు, పలువురు సిఐలు, ఎస్ఐలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20న సీనియర్ ఫుట్‌బాల్ జిల్లా పురుషుల జట్టు ఎంపిక స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో జరగనుందని కోచ్ రాము ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 గంటలకు క్రీడాకారులు హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

టేబుల్ టెన్నిస్, కుస్తీ పోటీలకు...

ఈనెల 20న విజయనగరం పువ్వాడ పాఠశాలలో అండర్ 19 విభాగంలో టేబుల్ టెన్నిస్, నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తామని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్ల లోపు బాల,బాలికలు ఈ పోటీలకు హాజరు కావాలని తెలిపారు. ఆధార్ స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు.

బాలికల వసతి గృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్జి విజయకళ్యాణి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కె.విజయ కళ్యాణి గురువారం నగరంలోని కాటవీధిలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని, బాబామెట్ట లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసినారు. కాటవీధిలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గహంలో మరుగుదొడ్ల పరిశుభ్రంగా లేవని తలుపులు సరిగ్గా లేవని గుర్తించారు. భవనము శిథిలావస్థకు చేరుకున్నట్లు గమనించారు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు భవనం వర్షానికి లీక్ అవుతున్నట్లు వార్డెన్ తెలిపారు, బాలురకు నిద్రపోవడానికి తుప్పు పట్టిన ఐరన్ మంచాలు ఉన్నట్లు గమనించారు ఇందుకు సంబంధించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను ప్రశ్నించగా ఉన్నత అధికారులకు తెలియజేశామని వివరించారు. అనంతరం బాబా మెట్ట ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ బాలికలకు సరిపడా బాత్రూములు లేనట్లు గుర్తించారు బాలికలకు అందుతున్న ఆహారము మెనూకు సంబంధించి వివరాలను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఉన్న బాలికలతో మాట్లాడి వారికి సరియైన సదుపాయాలు,వైద్య సదుపాయాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం బాలికలకు ఆహారం అందుతుందా లేదా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు.

బిజెపి నాయకుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ జాతీయ నాయకులైన రాహుల్ గాంధీపై బిజెపి మిత్రపక్షాలు చేసిన దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. విద్యాసాగర్ అన్నారు. గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బిజెపి మిత్రపక్షాల వ్యాఖ్యలను ఖండిస్తూ డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై బిజెపి మిత్రపక్షమైన శివసేన పార్టీ (షిండే వర్గం) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, ఇతర బిజెపి నేతలు చేసిన దిగజారుడు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో సరైనవి కావని అన్నారు ఇటువంటి మాటలు మానుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎస్‌పి కార్యాలయానికి వెళ్లి వినతి అందజేశారు. కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, ఎపిసిసి జనరల్ సెక్రెటరీ శాంతి కుమారి, నాయకులు సుంకరి సతీష్ కుమార్, డాక్టర్ గేదెల తిరుపతి, మైనార్టీ రాష్ట్ర నాయకులు షరీఫ్, ఎస్. శ్రీనివాసరావు, కరీం, బంగారు నాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పరిధిలో ఎక్కడా పోస్టర్లు గాని, ఫ్లెక్సీలు గాని ఏర్పాటు చేయరాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం తన ఛాంబర్ లో సినీ థియేటర్ అసోసియేషన్ ప్రతినిధులతోనూ, అనంతరం కోచింగ్ సెంటర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మన నగరాన్ని మనమే అందంగా రూపుదిద్దుకోవాలని అన్నారు. అందువల్లనే నగర వ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. సినిమా థియేటర్ల వద్ద పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని చెప్పారు. సినిమాలు విడుదల సందర్భంగా కూడా ఎక్కడ బయట ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు పోస్టర్లు ఫ్లెక్సీలు పెట్టరాదన్నారు. నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు పోస్టర్లు నిషేధిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ అమ్మాజీ రావు, ఫిలిప్ పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు 'శ్రీతులసి' ఆపన్న హస్తం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని వెంకట శివనగర్‌కి చెందిన గొలగాని పావని(24) ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె భర్త హరి కృష్ణ జైలు పాలయ్యాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు కళ్యాణ్ (4), సంజయ్ (2) అనాథలయ్యారు. ఆ చిన్నారులను ఆదుకునేందుకు పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శ్రీతులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు కర్నూరపు మురళీకృష్ణ ముందుకొచ్చారు. దిశ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వై.సురేష్ అభ్యర్థన మేరకు ట్రస్ట్ నిర్వాహకులు కొత్తవలస వచ్చారు. ముక్కుపచ్చలారని ఈ ఇద్దరి చిన్నారులను సాకేందుకు తమకు ఎటువంటి ఆధారమూ లేదని పావని తల్లి మంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కష్టాన్ని తెలుసుకున్న మురళీకృష్ణ కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు ఇద్దరి చిన్నారులను పదో తరగతి వరకు చదివించేందుకు తమ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-డెంకాడ

రఘుమండ రెవెన్యూ పరిధిలోని గెడ్డను ఆక్రమించి, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రోడ్డు వేస్తున్నారని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ గండ్రేటి గణేష్ .. గురువారం స్థానిక తహశీల్దార్ వి.పద్మావతికి ఫిర్యాదుచేశారు. సర్వే నంబర్ 76-10లో 1.72 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, రోడ్డు వేశారని తెలిపారు. దీనిపై ప్రశ్నించిన వారిపై దుర్భాషలాడుతూ తప్పుడు కేసులు పెడుతున్నారని వివరించారు. ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు తహశీల్దార్ స్పందిస్తూ ఆ సర్వే నంబర్‌పై ఫిర్యాదు వచ్చిందని, దానిని సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

మొదవలసకు చెందిన ఎన్నింటి రమేష్ తాతల కాలం నుంచి ఉన్న భూమిని తప్పుడు సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ వి.పద్మావతికి గురువారం ఫిర్యాదు చేశారు. ఆరుగురు వ్యక్తులు ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు సర్వేనెంబర్ 180లో 15, 16లో 1.26 ఎకరాల భూమిని రెవిన్యూ రికార్డులు మార్పులు చేసి అమ్మేశారని తెలిపారు. దీనిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాళి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెరుమాళి సర్పంచ్ హేమలత, నాయకులు అప్పలరాజు, ఎంఇఒ జె.త్రినాథరావు ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏడు క్రీడాంశాల్లో అండర్ -14, 17 విభాగాలలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపిస్తామని పిఇటి శ్రీనివాసరావు, సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పబ్లిక్ స్కూల్ వితరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విరాళాలను అందజేస్తున్న మొయిద నారాయణరావు

ఆపుస్మా సంస్థ సమాజ సేవలో ముందు ఉంటుందని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక గాజులురేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో విజయవాడ వరద బాధితుల సహాయార్థం విద్యార్థుల నుంచి సేకరించిన రూ.7వేలను, గ్రామంలో సేకరించిన రూ.18వేలు సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలోనూ ఎప్పుడు ఆపుస్మా యూనియన్ తన వంతు కృషి చేస్తుందని తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకోవాలి

చీపురుపల్లి : దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకోవాలని ఎపిజిఇఎ కార్యవర్గం నిర్ణయించింది. గురువారం చీపురుపల్లి ప్రెస్‌క్లబ్ వద్ద సంఘం ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎపిజిఇఎ తాలూకా అధ్యక్షులు పిన్నింటి హరి మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి పిఆర్‌సి, ఐఆర్‌లు మంజూరు కావాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా సంఘం తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి గిడిజాల లక్ష్మునాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాము పాల్గొన్నారు.

మాజీ సైనికుల కార్పొరేషన్ ప్రకటనపై హర్షం

బొబ్బిలి : మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటనపై వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో రెండు లక్షల మంది మాజీ సైనికులకు లబ్ధి కలుగుతుందని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

త్రోబాల్ పోటీలకు జాన్‌బాబు ఎంపిక

నెల్లిమర్ల : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి జాన్‌బాబు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కర్రి సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీల్లో విశాఖపట్నంలోని మున్సిపల్ స్టేడియంలో జరిగే త్రో బాల్ ఛాంపియన్‌షిప్‌లో జాన్‌బాబు పాల్గొనున్నట్లు తెలిపారు. జాన్‌బాబును హెచ్‌ఎంతోపాటు పిఇటిలు వి.రామచంద్రుడు, బి.జయకర్ జాన్సన్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జ్యూట్‌మిల్లు తెరిపించాలి

నెల్లిమర్ల : నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు వెంటనే తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముడి సరుకు కొరత పేరిట మూడు నెలలుగా స్థానిక జ్యూట్ మిల్లును యాజమాన్యం మూసి వేసిందని తెలిపారు. మిల్లు మూతపడటంతో కార్మికులు ఉపాధి లేక నానా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కి వినతులిచ్చి నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జ్యూట్ యాజమాన్యం పిఎఫ్, ఇఎస్ఐ బకాయిల కూడా చెల్లించలేదని, రిటైర్డు కార్మికులకు గ్రాడ్యుటీ బకాయిల ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి జ్యూట్‌మిల్లు తెరిపించాలని డిమాండ్ చేశారు.

సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలి

బొబ్బిలి : సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మిని ప్రజలు కోరారు. మున్సిపాలిటీలోని విశ్వబ్రాహ్మణ వీధి, వైశ్య భవనం వెనుక, దేవాంగులవీధి ప్రాంతాల్లో గురువారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చినబజారులో సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలని, విశ్వబ్రాహ్మణవీధిలో ఐరన్ స్తంభాలు తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఒ నాగరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

శృంగవరపుకోట : మండలంలోని కిల్తంపాలెం వద్దనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ వి.దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

నేడు జాకేరులో గ్రామ సందర్శన

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో శుక్రవారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. గురువారం జరగాల్సిన కార్యక్రమాన్ని శుక్రవారానికి వాయిదా వేసినట్లు చెప్పారు. గ్రామసభను విజయవంతం చేయాలని గ్రామస్తులను కోరారు.

నేడు విద్యుత్తు అంతరాయం

వేపాడ : మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వీలుపర్తి, వెళ్లాం, చినదుంగాడ, పెదదుంగాడ, చామలాదేవి అగ్రహారం, వావిలపాడు, కడకొండ, డిఆర్‌పేట, చామలపల్లి, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం, కరకవలస, మారిక గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్తంభానికి కట్టిన వైర్లను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనుల తనిఖీ చేశారు. కెఎల్ పురం, ఆర్టీసీ కాలనీ, ఉడా కాలనీ, అలకానంద కాలనీలలో రహదారుల నిర్మాణ పనులను పరిశీలించారు. అలకనంద కాలనీలో ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించారు. అయితే అక్కడ ఉన్న పార్క్ లోపల గుబురుగా పెరిగిన మొక్కలను తక్షణమే తొలగించాలని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనుల సమాచారాన్ని సమగ్రంగా అందించలేని ఎమ్యునిటీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా నిర్మాణ పనుల జరుగుతున్న సమయంలో అక్కడే ఉండాలని, నాణ్యతలో రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించండి

ప్రతి గురువారం వార్డు పర్యటనలో భాగంగా గురువారం 9వ డివిజన్‌లో నగరపాలక సంస్థ అధికారులు పర్యటించారు. కాటవీధి ఉర్దూ స్కూల్ నుండి ప్రారంభమైన వార్డు పర్యటనలో పాఠశాలల స్థితిగతులు, పారిశుధ్యం, అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా ఉర్దూ పాఠశాల ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెప్పారు. గోశాలలో ప్రహరీ గోడ, కాలువల్లో పైపుల లీకులు వంటివి ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఉన్నతాధికారులు దష్టిలో ఉంచి పరిష్కారానికి కృషి చేస్తామని తిరుమలరావు తెలిపారు. ఎంహెచ్ఒ కె.సాంబమూర్తి, స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ

10 మందికి గాయాలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్ వద్ద గణేష్ నిమజ్జనంలో ఘర్షణ చెలరేగింది. ఈ ఘటనలో పది మందికి గాయాలయ్యాయి. నగర పంచాయతీ పరిధి 8, 9 వార్డుల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించి, బుధవారం రాత్రి నిమజ్జన కార్యక్రమంలో రెండు వార్డుల యువకులు ఘర్షణకు దిగారు. తొలుత ఊరేగింపు ప్రారంభంలో రెండు గ్రూపుల యువకులు కొట్లాటకు దిగారు. పెద్దలు సర్దిచెప్పి గొడవను చల్లార్చారు. నిమజ్జనం పూర్తయ్యాక అర్ధరాత్రి సమయంలో తిరిగి కొట్లాటకు దిగారు. ఈ నేపథ్యంలో 9వ వార్డు కౌన్సిలర్ బూర సుజాత, ఆమె భర్త సత్యనారాయణ అడ్డగించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో వారిపైనా యువకులు దాడి చేశారు. ఈ కొట్లాటలో పది మందికి గాయాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామగణేష్ తెలిపారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్

ఎమ్మెల్యే బేబినాయన

అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పున:ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. పట్టణంలోని గురువారం సాయంత్రం అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే, వైసిపి సర్కారు వాటిని మూసివేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను పున:ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గత మూడేళ్లుగా పేదల ఆకలి తీర్చేందుకు సొంత నిధులతో అన్న క్యాంటీన్ నిర్వహించి, పేదల ఆకలి తీర్చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి, తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆందోళన చేస్తున్న ప్రజలు

సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరుతూ చీపురుపల్లిలో రిక్షా కాలనీ, కొత్త అగ్రహారం వాసులు గురువారం రైల్వే బ్రిడ్జి పనుల వద్ద ఆందోళన చేపట్టారు. సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టి, రైల్వే బ్రిడ్జి పనులు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని వారు తెలిపారు. అలా కాకుంటే పనులు ముందుకు సాగనివ్వ బోమని హెచ్చరించారు. రైల్వే బ్రిడ్జి పనుల వల్ల 15 రోజుల నుండి తాగునీరు అందడం లేదని, ఎవరైనా అనారోగ్యం బారిన పడేందుకు కనీసం సైకిల్‌పై ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కూడా తోవ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత కొన్ని రోజులుగా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు వాపోయారు. తమ ఆవేదనను పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగామని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ప్రజలకు సర్ది చెప్పడంతో వారు వెనుదిరిగారు.

స్వచ్ఛత దిశగా అడుగులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల ద్వారా ప్రతిఒక్కరూ స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని ఎంపిపి సండి సోమేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద అధికారులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఎపిఒ తిరుపతి, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమ, వైస్ ఎంపిపి ఐ.సుబ్బలక్ష్మి, ఎంపిటిసిలు వి.సింహాచలం, బి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.కన్నయ్య, పీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విజయనగరంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞను నగరపాలక సంస్థ అధికారులు చేయించారు. విజయనగరంలోని ఆరు సర్కిల్ ప్రాంతాల్లో ఉన్న ఆరు పాఠశాలల్లో ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. బాబామెట్టలోని బాలికల పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, బిపిఎం స్కూల్, కంటోన్మెంట్ స్కూల్, విటి అగ్రహారం స్కూల్, పువ్వాడ స్కూల్ లలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాలు జరిగాయి. బిపియం స్కూల్ వద్ద నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చిన్నతనం నుండే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

భోగాపురం... కేక్ కట్ చేస్తున్న ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి

డెంకాడ.. పండ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా బడ్డుకొండ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలను డెంకాడలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనకసింహాచలం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భారీ కేకు కట్ చేశారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, నాయకులు పతివాడ కృష్ణవేణి, సర్పంచులు లెంక లక్ష్మణరావు, కోరాడ రమణి, కోటినాయుడు, శివ, పతివాడ గౌరీ, కోరాడ కనకరాజు, పైల ముత్యాలరావు, ఎంపిటిసిలు జగన్నాథం, కిరణ్, రామనాయుడు, నాయకులు బుగత రమణ, తొత్తడి శ్రీను, అప్పారావు, రామానాయుడు, బోని అప్పలనాయుడు, సంచాన కృష్ణమూర్తి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని ఉప్పాడపేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 50 కిలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బైరెడ్డి యర్రప్పలనారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకుంటేనే కొనుగోలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పంట నమోదు చేసుకుంటేనే రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను ప్రభుత్వం కొంటుందని వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పంట నమోదు ఆశాజనకంగా ఉందని తెలిపారు. ఇ-పంట నమోదు చేసుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటలను అమ్ముకోవచ్చని చెప్పారు. పంటలకు నష్టం జరిగితే నష్టపరిహారం పొందవచ్చనని వెల్లడించారు. వడ్డీ మాఫీ, బ్యాంకు రుణాలు, అన్ని రకాల ప్రభుత్వ పథకాలు పొందవచ్చని వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 92శాతం ఇ-పంట నమోదు పూర్తిచేసినట్లు చెప్పారు. బొబ్బిలి మండలంలో 95, రామభద్రపురంలో 99, తెర్లాంలో 93, బాడంగి మండలంలో 92శాతం ఇ-పంట నమోదు జరిగిందని చెప్పారు. ఈ నెల 23లోగా రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు.

వేపాడ : ఈ నెల 23వ తేదీలోగా రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలని ఎఒ యశ్వంత్‌కుమార్ తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఇ-పంటలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, లేకుంటే ప్రభుత్వం నుంచి అందించే ప్రయోజనాలు కోల్పోతారని తెలిపారు. ఇ-పంటలో నమోదైతేనే పంట కొనుగోలు చేస్తారని చెప్పారు. ఇ-పంట నమోదు చేసుకున్న రైతులు ఇ-కెవైసి పూర్తిచేసుకోవాలని కోరారు.

పొలంబడితో రైతులకు మేలు

బొబ్బిలిరూరల్ : పొలంబడి కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలని వ్యవసాయ శాఖ ఎడి శ్యామసుందర్ అన్నారు. గురువారం కారాడ గ్రామంలో జిఎపి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా వరి పంటలో చిరుపొట్ట దశలో ఎరువుల వాడకం, తుపాను అనంతరం కనిపించే తెగుళ్లపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం చిరు పొట్ట దశలో ఎకరానికి 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. పొట్టకుళ్లు తెగులు లేదా పొడ తెగులుకు ముందుగా గానీ, వచ్చిన తరువాత గానీ హెక్సకోనాజోల్ అనే శిలీంద్రణాసిని ఎకరానికి 500 మి.లీ చొప్పున పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పెంట లత, మూడడ్ల సంతోషి పాల్గొన్నారు.

ఎం.బూర్జవలసలో

ఎం.బూర్జవలస గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకర్రావు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు ఐసిఆర్‌పి కన్నంనాయుడు పాల్గొన్నారు.

'సీతం'లో రోబోటిక్స్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'సిక్స్ సెన్సెస్ ఆఫ్ రోబోట్స్' అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. ప్రముఖ రోబోయిన్ సంస్థ తోడ్పాటుతో నైజీరియన్ దేశానికి చెందిన రోబోటిక్ యంత్రాల నిపుణులు రహీమ్ క్యాడస్ ట్రైనర్ గా విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ ఇందులో విద్యార్థులు వివిధ సెన్సర్లను ఉపయోగించి కోడింగ్ ద్వారా రోబోట్‌లను రూపొందించడంలోను, రోబోటిక్స్‌లో సెన్సార్ల ప్రాముఖ్యతను, వాటి వినియోగాన్ని తెలుసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి శ్రీమతి వెంకటలక్ష్మి మాట్లాడుతూ కార్యశాల ముఖ్య ఆవశ్యకత ను వివరించారు. కార్యక్రమంలో మొదటి సంవత్సరం విభాగాధిపతి కె.శ్రీలత ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వేపాడ.. సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

నేడు, రేపు ఆటల పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 20, 21వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని పీడీలు, సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రామభద్రపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 21న మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని చెప్పారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, చెస్.. క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.

నైతిక విలువలపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక వాగ్దేవి విద్యాసంస్థల్లో గురువారం చట్టాలు, విద్య, నైతిక విలువలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ 2047కి విద్య, వైద్య, వైజ్ఞానిక రంగాలలో ఇండియా అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఇందులో యువత పాత్ర ఎంతో కీలకమైనదని తెలిపారు. ప్రతిఒక్కరూ స్మార్ట్ వర్క్ చేస్తూ విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ కుమార్, లక్ష్మణరావు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృత్యువాత

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మృతిచెందిన అప్పారావు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం మండలంలోని కోమటిపల్లి సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెరకముడిదాం మండల కేంద్రానికి చెందిన జాడ అప్పారావు (21) మానాపురం నుంచి స్వగ్రామానికి స్కూటీపై వెళుతుండగా, దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి కుమార్‌నాయుడు మానాపురం వైపు బైక్‌పై వస్తున్నాడు. వీరిద్దరు కోమటిపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పెదమానాపురం ఎస్ఐ జయంతి తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని మీసాలపేట గ్రామానికి చెందిన బగ్గాం రాజు(50) గురువారం రైలు కిందపడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజు కొద్దిరోజుల నుంచి నడుము నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఇంటి నుంచి రాజు బయటకు వెళ్లి, ఎంత సేపటికీ తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతికారు. రైలుపట్టాలపై ఆయన మృతదేహం కనిపించింది. బొబ్బిలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేరాలు ఘోరాలు

బైకును ఢీకొన్న బస్సు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని కెఎల్‌పురం వద్ద బుధవారంరాత్రి బైక్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ద్వారపూడి గ్రామానికి చెందిన పెనుమల్ల శ్రీను (28), అతని సోదరుడు పెనుమల్ల రాజు (26) బైక్‌పై గంజిపేట వెళ్తుండగా కెఎల్ పురం దగ్గర వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వెనుక కూర్చున్న శ్రీనుకు కుడికాలు విరిగిపోయింది. అతడికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈయన ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వన్ టౌన్ ఎస్ఐ ప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

నా క్లయింట్ కర్ణపు శేషు w/o లేట్ సత్యం ఇచ్చిన సమాచార ప్రకారం, ఆమె తన ఇంటి తాలూకా డాక్యుమెంట్ నెం. 2732/2009 తాలూకా లింకు డాక్యుమెంట్ నెం 1618/1994 ను విజయనగరం కలెక్టర్ ఆఫీసు జంక్షన్ లో జెరాక్స్ తేయుటకు వెళుతుండగా పోయినది. లింకు డాక్యుమెంట్ పోయినది అని విజయనగరం 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసియున్నాను. కావున పై లింకు డాక్యుమెంట్ ఎవ్వరికైనా దొరికిన క్రింది అడ్రసు వారికి సమాచారము ఇవ్వగలరని ప్రార్థన. పై లింకు డాక్యుమెంట్స్ తో ఎవరైనా ఎటువంటి వ్యవహారము జరిపిన అది చెల్లుబాటు కాదని మరియు నా క్లయింటు ను బందించజాలదని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము.

K.H.V.A.NAIDU B.Com. B.L
ADVOCATE & NOTARY
5-5-6 Gavara Veedhi,
Vizianagaram 535 001
Cell 9440143107, 9494973736

బహిరంగ వేలం ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 20/2022 OS 14/2021

Between :
శ్రీ బొంతలకోటి పూర్ణ చంద్రరరావు ...డిక్రీ హోల్డర్/వాది
AND :
శ్రీ దామోదర రమేష్ వగైరాలు...జడ్జిమెంట్ డెటార్ / ప్రతివాది

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై నంబరు దావాలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తము శ్రీ కోర్ట్ వారిచే జప్తు చేయబడిన జడ్జిమెంటు డెట్టార్స్ యొక్క దిగువ షెడ్యూల్ దాఖాలలో చూపబడిన స్థిరాస్తి వేలం యిస్తిహార్ ప్రకారం శ్రీ కోర్టువారు **తే.27-09-2024 ఉదయం 10:30 గంటల** నుండి శ్రీ కోర్టు వారి సమక్షంలో సమస్త ఈజుమెంట్ హక్కులతో సహా బహిరంగంగా వేలం వేయుటకు నిర్ణయించినారు కావున ఆసక్తి గల వారందరునూ పైకోర్టు వారి ఎదుట వేలంలో పాడుకొన వచ్చునని యిందు మూలముగా శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం తెలియజేయుచున్నాము.

NB :- షెడ్యూలు ఆస్తి పంజాబ్ నేషనల్ బ్యాంకు, MVP Colony Branch, Visakhapatnam వారి యొక్క తనఖా మొత్తం రూ.9,00,000/- లకు లోబడి పాడుకొనవలెను

షెడ్యూల్ :- విజయనగరం జిల్లా, శృంగవరపు కోట సబ్ రిజిస్ట్రార్ యిలాక, శృంగవరపు కోట పంచాయతి మరియు రెవిన్యూ గ్రామము, సర్వే నెంబరు 441, వార్డు నెంబర్: 10, మునసబువీధి, బ్లాక్ నెం: 8, ఇంటి నెంబర్ : 10-84 కలిగి స్థలం విస్తీర్ణం సుమారు 84.44 చ॥గజములు లలో నిర్మాణ 760 చ॥అడుగులు విస్తీర్ణంతో, గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్‌ఫ్లోర్ గల R.C.C. స్లాబ్ ఇంటికి హద్దులు:
తూర్పు:- రొంగలి అప్పలనరసమ్మ గారి R.C.C. స్లాబ్ ఇల్లు,
దక్షిణం:- పంచాయితి రోడ్డు, **పడమర:-**పంచాయితి రోడ్డు,
ఉత్తరం:- పంచాయితి రోడ్డు

Decree Holder's Value	: Rs. 35,00,000/-
Amin Value	: Rs. 25,00,000/-
Market Value	: Rs. 20,09,768/-
J.DR Value	: Not Furnished.

By Order of the Court

ఇనుగంటి రమేష్,
న్యాయవాది.
సెల్: 9440738240
విజయనగరం